క్లుప్తంగా

అమ్మవారికి రూ.7.97 లక్షల ఆదాయం



నరసరావుపేట రూరల్: ఇస్సప్పాలెం గ్రామంలో వేంచేసియున్న మహంకాళి అమ్మవారి దేవస్థానానికి హుండీల ద్వారా రూ. 7,97,033ల ఆదాయం లభించింది. ఆలయ హుండీల లెక్కింపును గురువారం నిర్వహించారు. దేవాలయ హుండీల ద్వారా రూ.7,37,207లు, అన్నదాన హుండీ ద్వారా రూ.59,826లు ఆదాయంగా లభించింది. 75 రోజులకు ఈ ఆదాయం లభించినట్టు ఆలయ ఈఓ టి. సుధాకరరెడ్డి తెలిపారు. హుండీ లెక్కింపు పర్యవేక్షకులుగా దేవదాయ ధర్మదాయ శాఖ ఈఓలు ఆర్.వెంకటేశ్వరరావు, బండి శ్రీనివాసరావులు వ్యవహరించారు. ఆలయ మాజీ ధర్మకర్తల మండలి సభ్యులు వంకా శ్రీనివాస రెడ్డి, అశోక్‌బాబు, చైతన్య గోదావరి బ్యాంక్ సిబ్బంది, ఆలయ సిబ్బంది, సేవా మండలి సభ్యులు లెక్కింపులో పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి



నాదెండ్ల: గుంటూరు – కర్నూలు రాష్ట్రీయ రహదారి సాతులూరు పెట్రోల్ బంకు సమీపంలో ద్విచక్రవాహనాన్ని ఎదురుగా వస్తున్న కారు ఢీకొన్న ప్రమాదంలో యువకుడు దుర్మరణం పాలవగా, మరో వ్యక్తి తీవ్ర గాయాలపాలై ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. ఎస్సై ఆవుల భాస్కర్ కథనం ప్రకారం.. రొంపిచర్ల మండలం, వడ్లమూడివారిపాలెంకు చెందిన బండారి హరికృష్ణ (30), చల్లగుండ్ల ఏసుబాబులు ద్విచక్రవాహనంపై నాదెండ్ల మండలం గొరిజవోలు గ్రామంలో గురువారం తాపీ పనులకు వచ్చారు. పనులు ముగించుకుని సాయంత్రం 6 గంటల సమయంలో స్వగ్రామానికి వెళ్తుండగా, సాతులూరు వద్ద ఎదురుగా వస్తున్న కారు ఢీకొంది. దీంతో వాహనం నడుపుతున్న బండారి హరికృష్ణ అక్కడికక్కడే మృతి చెందగా, వెనుక కూర్చున్న ఏసుబాబుకు తీవ్ర గాయాలయ్యాయి. ప్రమాదంలో కారు పల్టీ కొట్టి రోడ్డు పక్కన కాలువలో పడింది. క్షతగాత్రుడిని 108 సాయంతో నరసరావుపేట ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. ప్రమాదం కారణంగా సుమారు గంట పాటూ రహదారిపై ట్రాఫిక్ స్తంభించింది.

రేపు మండల పరిషత్ సమావేశం

చిలకలూరిపేటటౌన్: చిలకలూరిపేట మండల పరిషత్ సర్వసభ్య సమావేశం శనివారం నిర్వహిస్తున్నట్లు ఎంపీపీ దేవినేని శంకరరావు తెలిపారు. ఉదయం 11గంటలకు ఎంపీడీవో కార్యాలయంలోని సమావేశ మందిరంలో నిర్వహించే ఈ సమావేశానికి సంబంధిత శాఖ అధికారులు, సభ్యులు హాజరుకావాలని కోరారు.

దాడి చేశారంటూ ఫిర్యాదు

యడ్లపాడు: వీధిలో గేదెను కట్టేయడంతో గొడవ జరిగి కేసు వరకు దారి తీసింది. పోలీసుల కథనం ప్రకారం.. మండలంలోని ఉన్నవ గ్రామంలో ఎస్సీకాలనీకు వెళ్లే మార్గంలో ఉన్నవ శ్రీనివాసరావు అనే వ్యక్తి తన దూడను కట్టేసి సమీపంలోని ఇంట్లోకి వెళ్లాడు. ఇంతలోనే కట్టు ఊడదీసుకున్న దూడ అటుగా వస్తున్న కె.ఉదయలక్ష్మి అనే మహిళపైకి దూకింది. ఆమె చేయి అడ్డుపెట్టే సరికి కొమ్ము తగిలి కిందపడిపోయింది. విషయం తెలుసుకున్న మహిళ కుమారుడు వేణు వీధిలో గేదెను ఎందుకు కట్టేశావంటూ గొడవపడ్డాడు. అనారోగ్య సమస్యలతో ఉన్న శ్రీనివాసరావును దుర్భాషలాడుతూ దాడి చేశాడంటూ ఏపీ రజక యువసేన సంఘం అధ్యక్షుడు రవి ఆధ్వర్యంలో పోలీసులకు ఫిర్యాదు చేశారు. గురువారం కేసు నమోదు చేసి విచారణ చేస్తున్నట్లు ఎస్‌ఐ రాంబాబు తెలిపారు.

కిసాన్ క్రెడిట్ కార్డులు సద్వినియోగం చేసుకోండి

శావల్యాపురం: కిసాన్ క్రెడిట్ కార్డులను పాడి రైతులు సద్వినియోగం చేసుకుని జీవనోపాదులు పెంపొందించుకోవాలని డివిజన్ పశు సంవర్ధకశాఖ ఉప సంచాలకులు డి.నరసింహులు అన్నారు. గురువారం స్థానిక వైఎస్సార్ క్రాంతి పథకం కార్యాలయంలో జగనన్న పాల వెల్లువ కార్యక్రమం పురోగతి, కిసాన్ క్రెడిట్ కార్డు పథకం తదితర వాటిపై ఆయన సమీక్షించారు. ఆయనతో పాటు ఏపీయం జి.వాసుబాబు, పశువైద్యాధికారులు సురేష్, గణేష్ కుమార్, సీసీలు ఖాజావలీ, గొట్టం రమాదేవి ఉన్నారు.

బదిలీపై వెళ్లిన ఉపాధ్యాయులకు సన్మానం

నాదెండ్ల: విద్యార్థులు ఉన్నతంగా ఎదిగినపుడే ఉపాధ్యాయుల కృషికి సార్ధకత లభించినట్లని విద్యాదాత, గోల్కొండ గ్రూపు సంస్థల చైర్మన్ నడికట్టు రామిరెడ్డి చెప్పారు. చిరుమామిళ్ళ కాసు రాఘవమ్మ, బ్రహ్మానందరెడ్డి ప్రాథమిక పాఠశాలలో ఇటీవల బదిలీ అయిన ముగ్గురు ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించారు. ఐతా వెంకటేశ్వరరావు, కెసీహెచ్ లక్ష్మయ్య, డి నూతనప్రసాద్ బదిలీపై చందవరం, తూబాడు, నాగవరం ప్రాథమిక పాఠశాలలకు బదిలీ అయ్యారు. గురువారం ముగ్గురు ఉపాధ్యాయులను తోటి ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు పూలమాలలు, శాలువాలతో సత్కరించారు. నూతన వస్త్రాలు అందించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం కరిముల్లా, స్థానిక పెద్దలు యన్నం శివారెడ్డి తదితరులు ఉన్నారు.

వలంటీర్లకు వందనం

ఆస్పత్రికి వచ్చి.. పింఛను చేతికిచ్చి...

యడ్లపాడు: నాపేరు మారెళ్ల సీతామహాలక్ష్మి. భర్త చనిపోయాడు. మాకు పిల్లలు లేకపోవడంతో చెల్లిలి కూతుర్ని పెంచి పెళ్లిచేశాం. ప్రస్తుతం ఊళ్లో ఒంటరిగానే ఉంటున్నా. కోవిడ్ సమయంలో బండిమీద నుంచి జారీ పడటంతో చేయి గూడజారింది. గుంటూరులోని ఓ ఆస్పత్రిలో చేరా. విషయం తెలుసుకున్న గ్రామ వలంటీర్ మామిడాల సౌజన్య 2022 ఆగస్టు 3వ తేదీన ఆస్పత్రికి వచ్చి పింఛన్ డబ్బులు ఇచ్చింది. ఒకవైపు కోవిడ్ బాగా ఉన్న ఆ పరిస్థితుల్లో ఆస్పత్రికి వచ్చి పింఛన్ డబ్బులు ఇవ్వడం గొప్పసేవే. అప్పుడు పింఛన్ సొమ్ము బాగా ఉపయోగ పడింది. కనీసం చార్జీలకు డబ్బులిస్తామన్నా తీసుకోలేదు.

–ఎం సీతామహాలక్ష్మి, చెంఘీజ్‌ఖాన్‌పేట





గుంటూరు ఆస్పత్రిలో సీతామహాలక్ష్మికి పింఛన్ సొమ్ము అందజేస్తున్న వలంటీర్ సౌజన్య(ఫైల్)

వలంటీర్ వ్యవస్థ చాలా గొప్పది

యడ్లపాడు: నాపేరు బసెల శ్రీనివాసరావు. మాది చెంఘీజ్‌ఖాన్‌పేట కోవిడ్ సమయంలో మా నాన్నకు హఠాత్తుగా సాంబయ్యకు బ్రెయిన్‌స్ట్రోక్ వచ్చింది. రాత్రికి రాత్రే గుంటూరు ఆస్పత్రికి తీసుకెళ్లాం. మరుసటి రోజు పింఛన్ల పంపిణీ జరుగుతోంది. మా వార్డు వలంటీర్ ఇంట్లో ఎవరూ లేరంటూ మాకు ఫోన్ చేశాడు. నాన్న పరిస్థితి వివరించి ఆస్పత్రికి వచ్చామని చెప్పాం. అంతే వెంటనే గుంటూరు చేరుకుని రూం వెతుక్కుంటూ వచ్చి పింఛన్ డబ్బులు ఇచ్చారు. మేము ఎవరం ఊహించలేదు. జగనన్న తెచ్చిన వలంటీర్ వ్యవస్థ ప్రయోజనం ఏమిటో అప్పుడే తెలిసింది.

–బసెల శ్రీనివాసరావు, చెంఘీజ్‌ఖాన్‌పేట





గుంటూరు ఆస్పత్రిలో సాంబయ్యకు పింఛన్ డబ్బులు ఇస్తున్న వలంటీర్ చంద్రరావు (ఫైల్)

జగనన్న సురక్షకు అపూర్వ ఆదరణ

బుచ్చిపాపన్నపాలెంలో పర్యటించిన ఎమ్మెల్యే



కౌలురైతు కార్డును అందజేస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి

రొంపిచర్ల: రాష్ట్రంలో వై.ఎస్. జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం అధికారం చేపట్టిన నాటి నుంచి నేటి వరకు గ్రామంలో రూ.21 కోట్ల రూపాయలతో సంక్షేమ అభివృద్ధి పథకాలు అమలు చేశామని ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి అన్నారు. మండలంలోని తన స్వగ్రామమైన బుచ్చిపాపన్నపాలెంలో గురువారం నిర్వహించిన జగనన్న సురక్ష కార్యక్రమం సభలో ఆయన పాల్గొని మాట్లాడారు. 800 గృహాలు ఉన్న గ్రామంలో పింఛన్‌లు, అమ్మఒడి, రైతు భరోసా, ఆసరా, విద్యాదీవెన, వసతి దీవెన, చేయూత తదితర పథకాల ద్వారా రూ.14.48 కోట్ల రూపాయలు అందజేశామన్నారు. అలాగే రూ.6.71 కోట్ల రూపాయలతో గ్రామంలో సచివాలయం, రైతుభరోసా కేంద్రం, విద్యుత్ సబ్‌స్టేషన్, మంచినీటి పథకాలు, సీసీ రోడ్లు, డ్రైనేజీలు, పాఠశాల అభివృద్ధికి ఖర్చు చేశామన్నారు. గతంలో ప్రభుత్వ పథకాలు, సర్టిఫికెట్లు కావాలంటే జన్మభూమి కమిటీలు, బ్రోకర్‌లు, మధ్యవర్తులు, దళారీలు దగ్గరికి వెళ్లి ప్రాధేయపడాల్సి వచ్చేదన్నారు. జగన్‌మోహన్ రెడ్డి ప్రవేశ పెట్టిన పథకాలను వలంటీర్లే ఇళ్లవద్దకు వెళ్లి అన్ని రకాల సేవలు అందిస్తున్నారని తెలిపారు. ఈ సందర్భంగా జగనన్న సురక్ష పథకం ద్వారా గ్రామ సభకు వచ్చిన అర్జీలను అక్కడికక్కడే పరిష్కరించి సర్టిఫికెట్లు అందజేశారు. నూరు శాతం రాయితీపై కంది విత్తనాలను రైతులకు అందజేశారు. గ్రామానికి వెళ్లిన డాక్టర్ గోపిరెడ్డిని గ్రామస్తులందరూ ఆప్యాయంగా ఎదురేగి స్వాగతం పలికారు. ఈ సభలో జెడ్పీటీసీ పిల్లి ఓబుల్‌రెడ్డి, ఎంపీపీ గడ్డం వెంకట్రావు, వైఎస్సార్ సీపీ జిల్లా యువజన విభాగం అధ్యక్షుడు పడాల సాంబశివారెడ్డి, పచ్చవ రవీంద్ర బాబు, గ్రామ సర్పంచ్ రావులపల్లి లక్ష్మి, ఎంపీటీసీ తిరుపతయ్య, మాజీ సర్పంచ్ పోతులూరి సుబ్బారెడ్డి, చీమల శ్రీనివాసరెడ్డి, గజ్జల మునలారెడ్డి, నాగిరెడ్డి, మార్కెట్ యార్డు చైర్మన్ బత్తుల రామకృష్ణ, పాలిమేర శ్రీనివాసరెడ్డి, పడాల చక్రారెడ్డి, గెల్లి చిన కోటిరెడ్డి, గుండాల వెంకటేష్, కేతు షోడారెడ్డి, తహసీల్దార్ అంకారావు, ఎండీవో మాధ్యూబాబు, సచివాలయం, విద్యుత్ శాఖతో పాటు తదితర శాఖ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

వారు అధికారంలోకి వస్తే వలంటీర్ల వ్యవస్థ ఉండదు

నరసరావుపేట: రాష్ట్రంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నాయకత్వంలోని వైఎస్సార్‌సీపీ ప్రభుత్వాన్ని ఎన్నికల్లో మళ్లీ ఓటేసి కొనసాగించుకుంటేనే నవరత్నాల సంక్షేమ పథకాలు అమలౌతాయని ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి ప్రజలకు స్పష్టం చేశారు. చంద్రబాబు, పవన్ కల్యాణ్ అధికారంలోకి వస్తే వలంటీర్ల, సచివాలయ వ్యవస్థలను రద్దుచేసి సచివాలయ ఉద్యోగులను వేరే విభాగాలకు బదిలీ చేస్తారని హెచ్చరించారు. గురువారం రామిరెడ్డిపేట కబేళా మున్సిపల్ స్కూలులో 20,21వార్డులకు సంబంధించిన జగనన్న సురక్ష కార్యక్రమం ఆయా వార్డుల ఇన్‌చార్జి కాకుమాను సదాశివరెడ్డి అధ్యక్షతన నిర్వహించారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఎమ్మెల్యే గోపిరెడ్డి మాట్లాడుతూ నూతన రేషన్‌కార్డులు పొందాలంటే గతంలో చాలా సమయం పట్టేదని, ఇప్పుడు ఈ శిబిరంలో దరఖాస్తు చేసుకుంటే వారంరోజుల్లో మంజూరు చేస్తారన్నారు. ఒక కుటుంబంలోని కుమారులు నూతన కార్లు కొనుగోలు చేసినా, ఇన్‌కంటాక్స్ చెల్లిస్తున్నందు వలన పొందలేకపోయిన పింఛన్, సంక్షేమ పథకాలు ఆ కుటుంబానికి చెందిన రేషన్‌కార్డుల నుంచి తల్లిదండ్రులను విడదీసి వారికి నూతన కార్డులు మంజూరు చేయడం ద్వారా పొందే అవకాశం ప్రభుత్వం కల్పించిందన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ ఎం.రామ్మోహన్, మున్సిపల్ ఇంజనీర్ డి.శ్రీనివాసరావు, ఆర్‌వో జబ్బార్, షేక్ కార్పొరేషన్ చైర్మన్ ఆషాభేగం ఖాజావలి, ముదిరాజు కార్పొరేషన్ డైరెక్టర్ ఇయం. స్వామి, వార్డు నాయకులు చల్లా హనుమంతరావు, కుంచాల కోటేశ్వరరావు, బొగ్గరం మూర్తి, బండి శివ, జేకే కరిముల్లా, రిటైర్డు అధ్యాపకులు పల్లెర్ల మల్లికార్జునరెడ్డి పాల్గొన్నారు.



ధ్రువీకరణ పత్రం అందజేస్తున్న అధికారులు



మాట్లాడుతున్న తహసీల్దార్

అర్హులందరికీ ప్రభుత్వ పథకాలు

నరసరావుపేట రూరల్: అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ పథకాలు అందించడమే ప్రభుత్వ లక్ష్యమని డీఎల్‌పీఓ రమణయ్య తెలిపారు. జగనన్న సురక్ష కార్యక్రమం మండలంలోని లింగంగుంట్ల-2 సచివాలయం పరిధిలో గురువారం నిర్వహించారు. తహసీల్దార్ రమణానాయక్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా డివిజనల్ పంచాయతీ అధికారి రమణయ్య పాల్గొని మాట్లాడారు. జగనన్న సురక్ష కార్యక్రమం ద్వారా 11 రకాల ధ్రువ పత్రాలను ఉచితంగా అందజేస్తున్నట్టు తెలిపారు. ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. జగనన్న సర్వే 80 శాతం పూర్తిచేసిన వలంటీర్లను కార్యక్రమంలో సత్కరించారు. జగనన్న సురక్ష కార్యక్రమంలో దరఖాస్తులు చేసుకున్న 589 మందికి ధ్రువపత్రాలు అందజేశారు. కార్యక్రమంలో ఈఓపీఆర్‌డీ విజయ కుమార్, మాజీ సర్పంచ్ పొన్నపాటి విజయకృష్ణారెడ్డి, నంద్యాల సత్యనారాయణ రెడ్డి, దుపాటి వెంకటేశ్వర్లు, పొన్నపాటి పాపిరెడ్డి, ఏరువ వెంకటరెడ్డి, కటకటం బ్రహ్మం, పంచాయతీ కార్యదర్శి కేవీ ప్రసాద్ పాల్గొన్నారు.

పోట్లూరులో...

శావల్యాపురం: అర్హత కలిగి నేటి వరకు సంక్షేమ పథకాలు పొందనటువంటి లబ్ధిదారులు జగనన్న సురక్ష కార్యక్రమం సద్వినియోగం చేసుకోవాలని డీఎల్‌డీవో యం. వెంకటరెడ్డి అన్నారు. గురువారం మండలంలోని పోట్లూరు గ్రామసచివాలయ పరిధిలో గ్రామస్తులు, ప్రజాప్రతినిధులు, మండల గ్రామస్థాయి అధికారులు గ్రామసచివాలయ ఉద్యోగులు, వలంటీర్లు సమక్షంలో జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ అర్హులైన లబ్ధిదారులకు పార్టీలకు కులమతాలకు అతీతంగా వలంటీర్లు ఆన్‌లైన్‌లో నమోదు చేయించి సంక్షేమ పథకాలు వర్తించేలా అన్నీ శాఖల అధికారుల సమన్వయంతో చేయటం ప్రభుత్వ తీరుకు నిదర్శమన్నారు. అనంతరం 323 మంది లబ్ధిదారులకు వివిధ రకాల ధ్రువీకరణ పత్రాలను లబ్ధిదారులకు ఉచితంగా అందజేశారు. ఈకార్యక్రమంలో సర్పంచ్ పోపూరి జ్యోతి,వైఎస్ ఎంపీపీ నంబూరి ప్రభావతి, ఎంపీడీవో పేరుమీనా సీతారామయ్య, తహసీల్దారు షేక్ జాన్‌సైదులు, పంచాయతీ కార్యదర్శి కోమిటినేని అశోక్ చౌదరి, వివిధశాఖల అధికారులు పాల్గొన్నారు.

వేర్వేరు గ్రామాల్లో....

బొల్లాపల్లి: మండలంలోని అయ్యన్నపాలెం, చక్రాయపాలెం సచివాలయాల్లో జగనన్న సురక్ష గురువారం నిర్వహించారు. ఆయా సచివాలయాల పరిధిలో తహసీల్దార్ ఏవీ సుధాకర్, ఇన్‌చార్జి ఎంపీడీఓ షేక్ జిలానీ బాషాలు రెండు బృందాలు పాల్గొని ప్రజలకు సేవలు అందజేశారు. సచివాలయాల పరిధిలో లబ్ధిదారులకు ధ్రువీకరణ పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ సురక్షలో లబ్ధిదారులకు 11 రకాల సేవలు ఉచితంగా అందుతాయన్నారు. ఇన్‌చార్జి ఎంపీడీఓ ఎస్‌కె జిలానీబాషా మాట్లాడుతూ అయ్యన్నపాలెంలో 847లో, చక్రాయపాలెంలో 616 మంది లబ్ధిదారులకు సురక్షలో ప్రయోజనం చేకూరుతుందని తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్‌లు పి. సాయిబాబు, ఆర్. బంగినాయక్, జి. రవణమ్మ, బి. మంగమ్మబాయి, కె. గుర్నీబాయి, కె. లక్ష్మానాయక్, బిసి కార్పొరేషన్ డైరెక్టర్ బి. గురవయ్య, ఎంపిటిసిలు వి. గంగాబాషా, బి. లక్ష్మీబాయి, సచివాలయ కన్వీనర్ అవినాష్‌రెడ్డి, ఆర్.కృష్ణానాయక్. బి. మంత్రు నాయక్, బి. భట్టు నాయక్, శ్రీను నాయక్, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు, లబ్ధిదారులు పాల్గొన్నారు.

చేతికొచ్చిన కౌలురైతు కార్డు



చిత్రంలో కనిపిస్తున్న ఈ రైతు పేరు డి. కొండా నాయక్, బొల్లాపల్లి మండలం అయ్యన్నపాలెం సచివాలయం పరిధిలో వీరప్పకుంట తండా. గత ఐదేళ్లుగా పొలం కౌలుకు తీసుకొని సాగు చేస్తున్నాడు. అయినప్పటికీ ఎటువంటి కౌలు రైతు కార్డు అందలేదు. జగనన్న సురక్ష పథకంలో దరఖాస్తు చేసుకున్న వెంటనే కౌలు రైతు కార్డు ఇచ్చారు. దీని వలన రైతు భరోసాతో పాటు పలు ప్రయోజనాలు చేకూరతాయని సంతోషం వ్యక్తం చేశాడు.

ట్రిపుల్ ఐటీలో పలువురు విద్యార్థులకు చోటు

చిలకలూరిపేట: విద్యార్థులు ట్రిపుల్ ఐటీలో సీట్లు సాధించటం అభినందనీయమని పసుమర్రు ఎస్‌ఎంకే జెడ్పీ హైస్కూల్ హెచ్‌ఎం వై.హనుమంతరావు చెప్పారు. పాఠశాల విద్యార్థులు తస్నీరు హిమబిందు నూజివీడు ట్రిపుల్ ఐటీలో, పెట్లూరి రూపాంజలి ఒంగోలు ట్రిపుల్ ఐటీలో సీట్లు సాధించారు. ఈ విద్యార్థులకు పాఠశాల ప్రాంగణంలో గురువారం అభినందన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా హెచ్‌ఎం హనుమంతరావు మాట్లాడుతూ ప్రతి విద్యార్థి ఉన్నత లక్ష్యాలు కలిగి ఉండాలని చెప్పారు. ట్రిపుల్ ఐటీ సాధించిన విద్యార్థులను ఆదర్శంగా తీసుకొని పాఠశాల విద్యార్థులు విద్యాభ్యాసం కొనసాగించాలని కోరారు. కార్యక్రమంలో 15,16 వార్డు కౌన్సిలర్లు జాలాది సుబ్బారావు, షేక్ మస్తాన్‌వలి, పూర్వ విద్యార్థి సంఘం నాయకుడు హరిబాబు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ట్రిబుల్ ఐటీలో ఐదు మంది విద్యార్థులు ఎంపిక

శావల్యాపురం: మండలంలోని శావల్యాపురం, వేల్పూరు, మతుకుమల్లి గ్రామాల్లోని జెడ్పీ ఉన్నత పాఠశాలల్లో 2022–23 పదవ తరగతి అత్యుత్తమ ఫలితాలు సాధించిన ఐదు మంది విద్యార్థులకు ట్రిబుల్ ఐటీలో సీట్లు సాధించినట్లు ఏంఈఓ పుసులూరి లలితా కుమారి గురువారం తెలిపారు. ఈసందర్భంగా ఎంఈఓ మాట్లాడుతూ శావల్యాపురం హైస్కూల్లో సూరే ప్రేమ్‌సాగర్, (నూజివీడు) కంచర్ల మీరాజాస్మీన్‌లు, వేల్పూరులో పల్లపాటి నాగసాహితీయాదవ్, తాళ్ళూరి శుభాకర్, మతుకుమల్లి జెడ్పీ ఉన్నత పాఠశాల్లో కాల్వ చంటిలు ట్రిబుల్ ఐటీ సీట్లు సాధించినట్లు చెప్పారు.

ఇద్దరు కావూరు విద్యార్థులు

చిలకలూరిపేటటౌన్: మండలంలోని కావూరు గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు ఇరువురు ఒంగోలు ట్రిపుల్‌ఐటీ కి ఎంపికైనట్లు పాఠశాల హెచ్‌ఎం ఎస్.శ్రీనివాసరావు చెప్పారు. పాఠశాలకు ఇంజమూరు శ్రీలక్ష్మి, దొంతుల నాగలక్ష్మిలు ట్రి పుల్ ఐటీకి ఎంపికయ్యారు. ఈ సందర్భంగా గురువారం పాఠశాల ఆవరణలో అభినందన కార్యక్రమం నిర్వహించారు.

నాదెండ్లలో...

నాదెండ్ల: మండలంలో ఆరుగురు విద్యార్థులకు ట్రిపుల్‌ఐటీ సీట్లు సాధించారు.

చిరుమామిళ్ళ ఏపీ మోడల్ పాఠశాలలో పదో తరగతి పూర్తయిన తులసి పావని, ఎన్ శ్రీలక్ష్మీప్రసన్న, చిరుమామిళ్ళ నడికట్టు రామిరెడ్డి జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో మాలె శ్రీనివాసరావు, షేక్ రఫీ, గణపవరం శ్రీ కెల్లంపల్లి భద్రాచలం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో కందుకూరి నవీన్, సాతులూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన గారపాటి మనస్వితకు ట్రిపుల్ ఐటీ సీట్లు దక్కాయి. ఎంఈవోలు ఐ ఆంజనేయులు, ఈమని కృష్ణారెడ్డి, ఆయా పాఠశాలల హెచ్‌ఎంలు ఝాన్సీవాణి, ఎం సుందరరావు, ఐ కృష్ణా నాయక్, కె.వెంకటరావు, ఉపాధ్యాయులు సీట్లు సాధించిన విద్యార్థులను అభినందించారు.

సందెపూడి విద్యార్థి

యడ్లపాడు: మండలంలోని సందెపూడి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థి షేక్ రషీద్ ట్రిపుల్ ఐటీకి ఎంపికైనట్లు ఎంఈవో–1 నాగరత్నం తెలిపారు. చిలకలూరిపేట పట్టణంలోని విలీన గ్రామం మానుకొండవారిపాలెం గ్రామానికి చెందిన రషీద్ సందెపూడి హైస్కూల్లో 2022–23 విద్యాసంవత్సరంలో పదో తరగతి వరకు చదివాడు. ప్రకాశం జిల్లా ఒంగోలులోని ట్రిపుల్ ఐటీలో రషీద్‌కు సీటు లభించడంతో పాఠశాల హెచ్‌ఎం, ఉపాధ్యాయులు, ఎంఈవోలు నాగరత్నం, అరుణకుమారి విద్యార్థిని గురువారం అభినందించారు.

ప్రాథమికస్థాయిలోనే జీవన నైపుణ్యాలపై అవగాహన

యడ్లపాడు: విద్యార్థుల్లో ప్రాథమికస్థాయి నుంచే జీవన నైపుణ్యాలపై అవగాహన కల్పించి..వారిని సమాజంలో ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దాలనే లక్ష్యంతో ప్రభుత్వం కృషి చేస్తోందని ఉమ్మడి జిల్లాల ప్రభుత్వ డైట్ కళాశాల ప్రిన్సిపల్ ఎస్‌ఎం సుభాని చెప్పారు. రాష్ట్ర పాఠశాల విద్యాశాఖ కమిషనర్ ఆదేశాల మేరకు ఎస్‌సీఈఆర్‌టీ, మ్యాజిక్ బస్ ఫౌండేషన్ సంయుక్త ఆధ్వర్యంలో జీవన నైపుణ్యాల శిక్షణ కార్యక్రమం గురువారం ఆయన ప్రారంభించారు. బోయపాలెం జిల్లా విద్యా శిక్షణ సంస్థలో మూడు రోజులు పాటు నిర్వహించే ఈ శిక్షణా తరగతులకు గుంటూరు జిల్లా పరిధిలోని 50 ప్రభుత్వ పాఠశాలలకు చెందిన 100 మంది పీడీ/పీఈటీ, యాక్టివ్ టీచర్ ఒకరు చొప్పున హాజరయ్యారు. ప్రారంభ సమావేశంలో డైట్ ప్రిన్సిపాల్ ఎస్‌ఎం సుభాని మాట్లాడుతూ పిల్లలకు ప్రాథమిక స్థాయి నుంచే జీవన నైపుణ్యాలను పెంపొందించేందుకు ఈ శిక్షణ ఎంతో దోహదపడుతుందన్నారు. ఇటీవల రాష్ట్రస్థాయిలో శిక్షణ పొందిన వారిచే ఎంపిక చేసిన పాఠశాలల్లోని పాఠశాలల్లోని టీచర్లకు మూడు రోజుల పాటు తర్ఫీదు ఇవ్వనున్నట్లు వివరించారు. ఆయా అంశాలను తమ పాఠశాలల్లోని విద్యార్థులకు అవగాహన కల్పించాలని కోరారు.



మాట్లాడుతున్న డైట్ కళాశాల ప్రిన్సిపాల్ ఎస్‌ఎం సుభాని

ఫౌండేషన్ సౌత్‌ఇండియా టీం సభ్యులు శిక్షణ లక్ష్యం గురించి వివరించారు. డైట్ కళాశాల అధ్యాపకులు డాక్టర్ కె ప్రసాద్, కె యోగేశ్వరరావు, టి శ్రీనివాసరావు, అజయ్‌కుమార్ జీవన నైపుణ్యాలపై శిక్షణ ఇచ్చారు.

విద్యార్థులకు పుస్తకాలు పంపిణీ

రొంపిచర్ల: మండలంలోని కొత్తపల్లి జిల్లా పరిషత్, ఎంపీపీఎస్ పాఠశాలల్లో కోమటినేని నాసరయ్య తన మనుమరాలు యశశ్రీ పుట్టినరోజు సందర్భంగా గురువారం రూ.20 వేల రూపాయల విలువ చేసే నోట్ పుస్తకాలను విద్యార్థులకు అందజేశారు. పాఠశాలలో విద్యాభివృద్ధికి కృషి చేస్తున్న నాసరయ్యను ఈ సందర్భంగా అభినందించారు. చిన్నారి యశశ్రీకి విద్యార్థులు, ఉపాధ్యాయులు పుట్టిన రోజు శుభాకాంక్షలు తెలియజేశారు. పుస్తకాలతో పాటు విద్యార్థులకు మిఠాయిలు కూడా పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు బి. హోసన్నా, పేరెంట్స్ కమిటీ చైర్మన్ నందిగం ఏసుదానం, ఉపాధ్యాయులు మల్లిఖార్జునరావు, గ్రామ పెద్దలు తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థులకు పుస్తకాలు అందజేస్తున్న చిన్నారి యశశ్రీ

విభిన్న ప్రతిభావంతులకు ఉచిత ఉపకరణాలు

బొల్లాపల్లి: స్థానిక మండల పరిషత్ కార్యాలయం వద్ద విభిన్న ప్రతిభావంతులకు సహాయక పరికరాలను ఉచిత పంపిణీలో భాగంగా గుర్తింపు శిబిరం గురువారం నిర్వహించారు. దివ్యాంగులకు ఉపయోగపడే ఉపకరణములు ఉచితంగా అందజేసేందుకే ఈ శిబిరం నిర్వహించినట్లు డిజేబుల్డ్ సూపర్‌వైజర్ డి. శివలక్ష్మీ కలెక్టర్ ఉత్తర్వుల మేరకు విభిన్న ప్రతిభావంతులు, హిజ్రాలు, వయోవృద్ధుల సంక్షేమశాఖ, సమాజాక న్యాయం సాధికారత మంత్రిత్వ శాఖ, భారత ప్రభుత్వంకు సంబంధించి అలెన్‌కో ఆధ్వర్యంలో దివ్యాంగులకు ఉపకరణాలు అందజేయడంలో భాగంగా ఈ గుర్తింపు శిబిరం ఏర్పాటు చేశామని తెలిపారు. గుర్తింపు శిబిరంలో ఉపకరణాలు కావల్సిన విభిన్న ప్రతిభావంతుల పేర్లు నమోదు చేసుకొని వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ వైద్య శిబిరంలో 125 మందికి అవసరమైన వివిధ రకాల ఉపకరణాలు నమోదు చేసుకున్నామని, వీటిని త్వరలో అందజేస్తామన్నారు. వినికిడి యంత్రాలు, ట్రై సైకిల్స్, వీల్ చైర్స్, మోటార్ బైక్స్, బ్రెయిలీకిట్, క్యాలిపర్స్, క్రచర్స్ తదితర ఉపకరణాలు అర్హతను బట్టి అందజేస్తామని డిజేబుల్డ్ సూపర్‌వైజర్ తెలిపారు. కార్యక్రమంలో స్‌ఎస్‌ఎ అసిస్టెంట్ ఐఇ కోఆర్డినేటర్ మల్లికార్జున, వైద్య బృందం, సమగ్ర శిక్షా అధికారులు, ఇన్‌చార్జి ఎంపీడీఓ జిలానీబాషా, స్టేట్ బిసి కార్పొరేషన్ డైరెక్టర్ డి. గురవయ్య తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న డిజేబుల్డ్ ఏడీ శివలక్ష్మి

ప్రమాదాల నివారణకు చర్యలు తీసుకోండి

రొంపిచర్ల: స్థానిక పోలీస్ స్టేషన్‌ను నరసరావుపేట డీఎస్పీ కేవీ మహేష్ గురువారం సందర్శించారు. సాధారణ తనిఖీల్లో భాగంగా ఆయన స్టేషన్‌కు వచ్చారు. స్టేషన్‌లో రికార్డులను పరిశీలించారు. రహదారులపై ప్రమాదాల నివారణకు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అలాగే దీర్ఘకాలికంగా పెండింగ్‌లో ఉన్న కేసులపై కూడా దృష్టి సారించాలన్నారు. స్టేషన్‌లోని పరిసరాలను పరిశీలించారు. పోలీస్ సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో రూరల్ సీఐ భక్త వత్సలరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వడ్డీ రాయితీతో కూడిన రుణాలివ్వాలి

కౌలు రైతు సంఘం ఆధ్వర్యంలో నిరసన

ముప్పాళ్ళ: కౌలు రైతులకు గ్రూపుల ద్వారా పంట రుణాలు ఇవ్వడంతో పాటు ప్రభుత్వ వడ్డీరాయితీతో కూడిన పంట రుణాలను ఇవ్వాలని రాష్ట్ర కౌలురైతు సంఘం అధ్యక్షుడు వై.రాధాకృష్ణ అన్నారు. మండల కేంద్రంలోని చైతన్య గోదావరి గ్రామీణ బ్యాంకు వద్ద కౌలు రైతులకు రుణాలు ఇవ్వాలని కోరుతూ రైతులతో కలిసి గురువారం నిరసన కార్యక్రమం చేపట్టారు. వ్యవసాయం నష్టాల్లో కొనసాగుతుందని, కౌలు రైతులకు ప్రభుత్వ ప్రోత్సాహం అందక కుటుంబాలను పోషించుకోలేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. భూయజమాని సంతకం అనే నిబంధనను తొలగించి కౌలు రైతు కార్డులు ఇవ్వాలన్నారు. ప్రతి కౌలు రైతుకు స్కేల్ ఆఫ్ ఫైనాన్స్ ప్రకారం గ్యారెంటీ లేకుండా పంట రుణాలు ఇవ్వాలన్నారు. రిజర్వు బ్యాంకు ఆదేశాల మేరకు భూమి ఆధారంగా కాకుండా పంట ఆధారంగా రుణాలు ఇవ్వాలని ఆయన డిమాండ్ చేశారు. కౌలు రైతుల సంఘం జిల్లా అధ్యక్షుడు కె.రామారావు, జిల్లా కార్యదర్శి గుంటుపల్లి బాలకృష్ణ, నాయకులు తొరటి అమరలింగేశ్వర రావు, కౌలు రైతులు అన్నపురెడ్డి శ్రీనివాసరెడ్డి, అన్నపురెడ్డి రంగారెడ్డి, కారుమూరి రఘునాథరెడ్డి అనెకల్లు రామలింగారెడ్డి, మధిరపెద్దారెడ్డి, మహిపతి శ్రీను తదితరులు పాల్గొన్నారు.

ప్రమాదాలు జరగకుండా చూడండి

నరసరావుపేట: స్కూలు, కళాశాలకు చెందిన విద్యార్థినీ విద్యార్థులను ఇంటి నుంచి స్కూల్‌కి, స్కూల్ నుంచి ఇంటికి తీసుకు వెళ్లే క్రమంలో బస్సులకు ఎటువంటి ప్రమాదాలు జరగకుండా యాజమాన్యాలు, డ్రైవర్లు అప్రమత్తంగా ఉండాలని డీఎస్పీ కేవీ మహేష్ కోరారు.

గురువారం డీఎస్పీ కార్యాలయ ప్రాంగణంలో ఎస్పీ రవిశంకర్‌రెడ్డి ఆదేశాల మేరకు నరసరావుపేటలో పట్టణ, రూరల్ పరిధిలో స్కూళ్ల యజమానులు, బస్‌డ్రైవర్లతో తీసుకోవా ల్సిన జాగ్రత్తలపై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై, పాటించ వలసిన పద్ధతులపై పలు సూచనలు చేశారు. బస్సులు యాక్సిడెంట్ జరగకుండా చేపట్టాల్సిన అంశాలపై చర్చించారు. ఇదే విధంగా వినుకొండ, చిలకలూరిపేట స్కూల్ యాజమాన్యం, బస్ డ్రైవర్లతో సమావేశం నిర్వహించి ఎలాంటి అవాంఛనీయ సంఘటన జరగకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పిస్తామని పేర్కొన్నారు.



సూచనలు చేస్తున్న డీఎస్పీ మహేష్

ఎస్‌ఎస్ అండ్ ఎన్ విద్యార్థికి పతకాలు

నరసరావుపేట ఈస్ట్: శ్రీసుబ్బరాయ అండ్ నారాయణ కళాశాల విద్యార్థి వై.మధుకిషోర్ అంతర్‌జిల్లాల ఈత పోటీలలో పలు విభాగాలలో పతకాలు సాధించినట్టు కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ సోము మల్లయ్య, వ్యాయామ అధ్యాపకుడు డాక్టర్ యక్కల మధుసూదనరావు గురువారం తెలిపారు. కళాశాల ఈత కొలనులో నిర్వహించిన 8వ రాష్ట్ర స్థాయి అంతర్ జిల్లాల ఆక్వాటిక్ స్విమ్మింగ్ చాంపియన్‌షిప్–2023 పోటీలో మధుకిషోర్ 50 మీటర్లు ఫ్రీ స్టైల్ విభాగంలో బంగారు పతకం, 100 మీటర్లు బటర్ ఫ్లై విభాగంలో కాంస్య పతకం సాధించాడని వివరించారు. విద్యార్థి మధుకిషోర్‌ను కళాశాల పాలకవర్గ అధ్యక్ష, కార్యదర్శులు కపలవాయి విజయకుమార్, నాగసరపు సుబ్బరాయగుప్త, ఇంటర్మీడియెట్ ఇన్‌ఛార్జ్ డాక్టర్ ఎం.ఎస్.సుధీర్, అధ్యాపకులు అభినందించారు.



విద్యార్థితో ప్రిన్సిపల్ డాక్టర్ మల్లయ్య, పీడీ డాక్టర్ మధుసూధనరావు